విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం 18, జూన్ - 2024 | 8 పేజీలు

ఇచ్చిన హామీలు అమలు చేయండి..ప్రజల మన్ననలు పొందండి :స్వామి ముకుందానంద

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకపోతే చరిత్ర హీనులవుతారని అలాంటి వారిని దేవుడు కూడా క్షమించడని చెన్నూరు మండలం ఉప్పర పల్లెలో వెలసిన దత్తాత్రేయ పీఠాధిపతి స్వామి ముకుందానంద అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎంతో ఆశతో ఓట్లు వేసి గెలిపించారని వారి ఆశలను తీర్చాలని కోరారు. ఎందుకంటే భగవద్గీత, భారత రాజ్యాంగం మీద ప్రమాణం చేసి తాము ఎలాంటి రాగ ద్వేషాలకు పోకుండా ఓర్పుతో అందరినీ సమాన దృష్టితో చూస్తామని చెప్పారని అధికారం లోకి వచ్చాక వాటికి వ్యతిరేకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పూవ్యవహరిస్తే దేవుడు శిక్షిస్తాడని చెప్పారు.లోక కల్యాణం కోసం తాను భగవద్గీతను బోధిస్తానని చెప్పారు. ప్రతి రాజకీయ నాయ కుడు అహింస పరమో ధర్మః అన్న సత్యాన్ని తెలిసికోలని హితవు పలికారు.

యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా...?

పట్టపగలే తరలింపు.. అడుగంటుతున్న భూగర్భ జలాలు

అటువైపే చూడని అధికారయంత్రాంగం



అనుమతుల్లేకుండా కొందరు ఇసుక మాఫియా పట్టపగలే ఇసుక దోచుకుపోతున్నారు.. రాత్రివేళల్లో దొంగతనంగా దోచుకెళ్లేవారు ఇంకొందరు...మార్గాలు ఏవైనా జమ్మలమడుగులో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక కనిపిస్తే చాలు కడప జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పోలీస్,రెవెన్యూ, సెబ్ అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు పెన్నా నదిలో ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు.. మార్గాలేవైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు.ట్రాక్టర్లతో పెన్నా నదిలో ఇసుకను తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. మరోవైపు జనానికి మాత్రం చుట్టూ ఇసుక ఉన్నా సహేతుక ధరల్లో ప్రభుత్వం నుంచి ఇసుక అందడం లేదు. ఇసుక కావాలంటే దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన పోలీసులు, అధికారులే చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇసుకదందా జోరుగా సాగుతోంది.టాస్క్ ఫోర్స్ బృందాలతో చర్యలు తీసుకుంటున్నామని అటు పోలీసులు, ఇటు రెవెన్యూ అధికారులు చెబుతున్నా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. పెన్నానదిలో నీరు ఖాళీ అయి.. ఇసుక పైకి తేలిందంటే చాలు, నిలువునా దోచుకుని సొమ్ముచేసుకునేందుకు అక్రమార్కులు సిద్ధమై పోతున్నారు. ప్రజాప్రతినిధులు అధికారులు, పోలీసులు అండదండలు ఉండటంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ముఖ్యంగా జమ్మలమడుగు పెన్నానది హై లెవెల్ బ్రిడ్జి సమీపాన ఇసుక దోపిడికి అడ్డాగా మారుతున్నాయి. జమ్మలమడుగు ప్రాంతంలో ఎక్కడ ఇసుక రీచ్ కు

అనుమతులు లేకపోవడంతో యదేచ్చగా ఇసుక అక్రమ దందా కొనసాగుతుంది. ఇటీవలే జమ్మలమడుగు లోని పెన్నా నది హై లెవెల్ బ్రిడ్జి సమీపంలో ఇసుకను అక్రమంగా అధికార పార్టీ నాయకులు తరలిస్తున్నారని ప్రతిపక్షాలు పార్టీ నాయకులు ఆరోపించడం జరిగింది.రోజుకు 100 ట్రాక్టర్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇతర ప్రాంతాలకు ఒక్కో ట్రాక్టర్ ధర రూ.10 వేలు పలుకుతోంది. దూరాన్ని బట్టి ట్రాక్టర్‌కు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వసూలు చేస్తున్నారు.జమ్మలమడుగు పెన్నా పరిసర ప్రాంతాలలో రాత్రి వేళల్లో ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసి తెల్లారేసరికి ఏమి జరగనట్లే ఉండటం ఈ దందాలో నయా పంథా. ఎవరైనా అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినా అధికారులు, పోలీసులు చూసిచూడన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు

2

నల్ల చట్టానికి స్వస్తి

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై కర్షకుల హర్షం

పేదల విజయం - కూటమి నేతలు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : రాష్ట్ర ప్రజలకు పీడకలగా మారిన ఏపీ భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుఇచ్చిన హామీని నెరవేర్చారంటూ రైతన్నల్లో ఆనందం వ్యక్తమవుతోంది. భూములపై అజమాయిషీ హక్కును పొందడానికి తీసుకొచ్చిన భూ హక్కు యాజమాన్య చట్టంతో రైతులందరికీ నష్టం చేకూరుతుందని కూటమి ప్రభుత్వం దాన్ని రద్దు చేయడాన్ని రైతులంతా స్వాగతిస్తున్నారు. ఈ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు దస్త్రంపై సీఎం సంతకం చేయడం విశేషం. ఇక తమ ఆస్తులకు ఎలాంటి ముప్పు లేదన్న అభిప్రాయం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. కొద్ది నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను ఆందోళనలకు గురిచేసిన నల్లచట్టానికి చంద్రబాబు ప్రభుత్వం స్వస్తి పలికింది. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ ఆయన సంతకం చేయడంతో రైతులు, పేదలు, న్యాయవాదుల సంఘాలు హర్షించాయి. ప్రజల స్థిరాస్తులను కొట్టేయడానికి జగన్ ప్రభుత్వం దుర్మార్గమైన ఈ చట్టాన్ని తెరమీదకు తీసుకొచ్చింది. కబ్జా చేసిన ఆస్తులకు చట్టబద్ధత తెచ్చుకునేందుకు వైకాపా పెద్దలు పావులు కదిపారు. సామాన్యుల ఆస్తులకు ఈ చట్టంతో రక్షణ లేకుండా పోతోందని న్యాయవాదులు, మేధావులు, నిపుణులు ఆందోళనలు చేసినా వైకాపా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. పైగా దీన్నే అమలు చేస్తానంటూ స్పష్టం

2

వీధిన పడిన వాలంటీర్లు..వైకాపా నేతలపై ఆక్రోశం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఐదేళ్లుగా కష్టపడ్డాం..తీరా ఎన్నికలు రాగానే రాజీనామా చేయాలంటూ ఒత్తిడి చేశారు..తప్పించుకొని తిరిగినా పట్టుబట్టి రాజీనామా చేయించారు..కొత్త ప్రభుత్వం వస్తే జీతం రూ.10వేలు వస్తుందని, ఉద్యోగ భద్రత కలుగుతుందని ఆశపడ్డాం..వైకాపా నాయకులు బలవంతంగా రాజీనామా చేయించడంతో రోడ్డున పడ్డాం.

ఇదీ నియోజకవర్గంలోని వాలంటీర్ల ఆవేదన.

జిల్లాలో 2019 ఆగస్టు మాసంలో ప్రారంభించిన గ్రామ, వార్డు వాలంటీరు వ్యవస్థ ద్వారా నియోజకవర్గంలో వందలాది మందిని రూ.5వేల గౌరవ వేతనం ఇచ్చేలా గత వైకాపా ప్రభుత్వం తీసుకుంది. డిగ్రీ, పీజీలు చేసి నిరుద్యోగ సమస్యతో తప్పని పరిస్థితుల్లో వైకాపా నేతల మాయమాటలు నమ్మి వాలంటీర్లుగా విధుల్లో చేరారు. విద్యార్హతలు బట్టి ప్రభుత్వ అధికారులు నిర్వహించిన ముఖాముఖిలో అర్హత సాధించిన తమను రాజీనామా చేయమనడానికి మీరెవరని కొందరు వాలంటీర్లు క్షేత్రస్థాయిలో ఎదురుతిరిగినా..నాయకులు ఒత్తిడి చేసి రాజీనామా చేయించారు. వైకాపా నాయకులు తమచేత బలవంతంగా రాజీనామాలు చేయించారంటూ వారిపై నియోజకవర్గంలోని పలువురు వాలంటీర్లు ఆక్రోషిస్తుండడం సంచలనంగా మారింది. తమకు తిరిగి ఉద్యోగాలు వచ్చేలా చూడాలని, న్యాయం చేయాలని పలువురు టీడీపీ నేతలను బ్రతిమలాడుకుంటుండడం చర్చనీయాంశంగా మారింది.

ఉపాధి కోల్పోయిన వందలాది మంది

ఎన్నికల విధులకు దూరం గా ఉండాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో కొం దరు నేతలు వారితో రాజీ నామా చేయించడంతో ప్రస్తుతం వారి కుటుంబాలు వీధిన పడే పరిస్థితి నెలకొంది. వైకాపా జెండాలు మోసేందుకు అత్యుత్సాహం చూపిన వాలంటీర్లతో పాటు నేతల ఒత్తిడి తోడు కావడంతో రాజీనామా లేఖను అధికారులకు అందజేసి నేతల వెంట ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల ఫలితాలతో చేసిన తొందరపాటు చర్యకు వాలంటీర్లు బాధపడే పరిస్థితి నెలకొంది. నాలుగేళ్ల పాటు ఇంటింటికీ పరిచయాలు పెంచుకున్న వాలంటీర్లు తమకు దూరమైతే ఓట్లు రాబట్టడం కష్టమవుతుందనే ఉద్దేశ్యంతో కొందరు నేతలు స్వార్థపూరితంగా బలవంతంగా తమతో రాజీనామా చేయించారని, తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని పలువురు కన్నీటి పర్యం తమవుతున్నారు.

చింతచెట్లకు తెగుళ్లు...

విశాలాంధ్ర-పులివెందుల: చింతచెట్లకు తెగుళ్లు వ్యాపించాయి. బహుశా విపరీతమైన ఎండలు అధిక ఉష్ణోగ్రతలకు తెగుళ్లు వ్యాపించడంతో అవి నిట్టనిలువునా ఎండిపోయాయి. పులివెందుల నుంచి కదిరికి వెళ్లే మార్గంలో అనంత జిల్లా పరిధిలో దారిపొడవునా ఉన్న చింతచెట్టు తెగుళ్ల బారిన పడ్డాయి. దీంతో చిరువ్యాపారులకు చింతాకు విక్రయించుకునే అవకాశం లభించలేదు. చింతాలకు అని తేలిగ్గా తీసుకుంటే సరిపోదు, దీని వల్ల బహుళ ప్రయోజనాలు లభిస్తాయి. తొలకరి పలుకరించగానే చింతచెట్టు చిగురు వేస్తుంది. ఈ చిగురును కొంత మంది వ్యాపారంగా చేసుకుంటారు. వేలు లక్షలు లాభం రాకపోయినా కుటుంబ పోషణకు కాస్తో కూస్తో దోహదపడుతుంది. సమయం సందర్భం రావడంతో పల్లెటూళ్లతో పాటు గ్రామీణ ప్రాంతాలల్లో చింతాకు వ్యాపారులు దర్శనమిస్తున్నారు. పేదలకు చెందిన కొంత మంది యువతులు అదే పనిగా చింతాకు విక్రయాలు సాగిస్తారు. కనీసం ఏదాది పొడవునా బొట్టు, కాటుక, రిబ్బన్‌లు

ఇలా అలంకార వస్తువులకు సరిపడు ఆదాయాన్ని సంపాదించుకోగలుతారు. అంటే చిన్న చిన్న ఖర్చులు తల్లిదండ్రులకు భారం కాకూడదనేదే వారి ఉద్దేశం. ఇక చింతపండు కూడా ఒక వ్యాపారం. కదిరి, మదనపల్లె వంటి ప్రాంతాలల్లో చింతచెట్టు దారిపొడవునా దర్శనమివ్వడం మనం కళ్లారా చూస్తుంటాము. వీటిని ప్రభుత్వం వేలం వేస్తుందని, గుత్తేదారుడి ద్వారా వచ్చే చెల్లించే గుత్తను ప్రభుత్వం రాబడిగా పరిగణిస్తుంది. మనిషి ఆరోగ్యాలకు కూడా దోహ

2

యధేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా...?

(మొదటి పేజీ తరువాయి)
వినిపిస్తున్నాయి.

పట్టపగలే ఇసుక అక్రమ రవాణా

జమ్మలమడుగు పట్టణంలోని ప్రధాన రహదారుల నందు పగటి వేళల్లో యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతుంది. జమ్మలమడుగు పట్టణంలోని పెన్నా ప్రవాహక ప్రాంతాలైన కన్నెల్లూరు, దిగువపట్నం కాలనీ తదితర ప్రాంతాల నుండి అక్రమార్కులు ట్రాక్టర్లతో ఇసుకను రవాణా చేస్తున్నారు. అలాగే గుడం చెరువు, గొనిగనూరు ప్రాంతాలలో అధికార పార్టీ నాయకులు పగలు రాత్రులు అనే తేడాలు లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ అధికారుల కళ్ళముందే ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లు వెళ్తున్నప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. ఇసుకను దోచేందుకు అక్రమార్కులు వ్యూహాత్మకంగా రవాణాకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికైనా పోలీస్,రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించి పెన్నా నది పరిసర ప్రాంతాల పైనా నిఘా పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

నల్ల చట్టానికి స్వస్తి

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి రాగానే చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటామని ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు మేనిఫెస్టోలోనూ ప్రకటించారు. జగన్ ఫోటో ముద్రించిన పట్టాదారు పుస్తకాన్ని తన ఎన్నికల ప్రచారంలో చించేసి కొత్తవి ఇస్తామంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు.

పేదల విజయం :ప్రజల ఆస్తులకు భద్రత లేకుండా పోయిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయడం పేదల విజయమని కూటమి నాయకులు కె.శివశంకర్‌రెడ్డి, ఎన్.విశ్వనాథరెడ్డి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు చట్టాన్ని రద్దు చేస్తూ సంతకం చేయడంతో ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారని వారు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాన్ని నడపాలని కోరుకుంటున్నామన్నారు. ఆస్తుల పరిరక్షణ పై ప్రజల్లో భయం నెలకొందని తమ పేరుతో అన్ని రకాల ధృవపత్రాలు ఉన్నా ఈ నల్లచట్టంతో రక్షణ లేకుండా పోయిందని వారు గుర్తుచేశారు. భూముల సమస్యలపై న్యాయస్థానాలకు వెళ్లే వీలుండదని నూతన ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవడం సంతోషం కలిగిస్తోందన్నారు.

చింతచెట్లకు తెగుళ్లు...

(మొదటి పేజీ తరువాయి)
దపడుతుంది. చింతాకు ద్వారా వైద్యం కూడా చేపడతారు. ఇది రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించి షుగర్ వ్యాధిని నియంత్రిస్తుంది. కనుక షుగర్ వ్యాధితో బాధపడేవారు చింత చిగురును తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. చింత చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని వైద్యులు అభిప్రాయపడ్డారు. చింత చిగురులో యాంటీ ఆక్సిమెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని దెబ్బతసే ఫ్రీ రాడికల్స్ మంచి రక్షించడంలో సహాయపడతాయని డాక్టర్లు చెబుతున్నారు. చింత చిగురును ముఖానికి ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు, ఇది మొటిమలను తగ్గించడంలో చర్మానికి నిగారింపు నిస్తుందని పలువురు చెబుతున్నారు. అంతేకాకుండా చింత చిరుగు జుట్టు రాలడాన్ని వినావించడానికి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. చింత చిగురుతో తయారు చేసిన హెచ్‌ప్యాక్‌ను జుట్టుకు పట్టించి అరగంట తర్వాత శుభ్రం చేసుకుంటే జుట్టు రాలడం తగ్గి పెరుగుదల ప్రారంభమవుతుంది. ఎన్నో ఉపయోగాలున్న చింత చెట్లు కూడా అక్కడక్కడ అంతరిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాలల్లో తెగుళ్లబారిన పడ్డాయి. ప్రభుత్వం స్పందించి తెగుళ్ల బారిన చింతచెట్లకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే బహుళ ప్రయోజనాలు కలిగించే చింతచెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మంత్రిని కలిసిన తంబళ్లపల్లి టిడిపి ఇంచార్జ్ జై చంద్రారెడ్డి

విశాలాంధ్ర-రాయచోటి:బక్రీద్ ను పురస్కరించుకొని తిరుపతి నాయుడు కాలనీలో బోనుమల ఖాదర్ వలీ ఇచ్చిన విందులో పాల్గొన్న తంబళ్లపల్లి టిడిపి ఇంచార్జ్ జై చంద్ర రెడ్డి అదే విందుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి మంత్రిగా ఎన్నికైనందుకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనతో పాటు అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు రాష్ట్ర మంత్రివర్యులు మండిపల్లికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ నాయకుడిని పరామర్శించిన ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-రాయచోటి: వీరబల్లి మండలం మట్లి పెద్దూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు గుదె నాగభూషణం నాయుడు కాలుకు ఇన్ఫెక్షన్ కావడంతో అనారోగ్యం కారణంగా రాయచోటి పట్టణంలోని ప్రైవేట్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు సోమవారం ఆసుపత్రి వద్దకు వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు ఆయనతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించి నాణ్యమైన చికిత్స పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రసాద్ బాబు ఆయనకు తెలియజేశారు. నాగభూషణం త్వరగా కోలుకుని నిండు ఆరోగ్యంగా రావాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, టీడీపీ నాయకులు మన్నేరు రామాంజనేయులు, బాలక్రిష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

త్యాగం ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ - ముక్కా వరలక్ష్మి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: త్యాగం సహనం దానగుణం ఐకమత్యానికి ప్రతీక అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి టిడిపి మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా టిడిపి మైనార్టీ సీనియర్ నాయకులు ముస్లిం మత పెద్ద సయ్యద్ బాబా సాహెబ్ ఆహ్వానం మేరకు వెళ్లి ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ముక్కా రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి బత్యాల చంగల్ రాయులు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా సాయివికాస్ రెడ్డి, జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ సోదరులు అందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. విజయ్ కుమార్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ముక్కా రజనికాంత్ రెడ్డి, ముద్దా గంగిరెడ్డి ,సాలవ రమణరాజు, పొలసాని కిరణ్ కుమార్, డాక్టర్ వేణు, గురు, ఆరవ నాని, సయ్యద్ మాభాష, రహీం,హబీబుల్లా, మండల అధ్యక్షులు కరీముల్లా, జాకీర్ తదితరులు ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

117 జీవోను రద్దు చేయాలని మంత్రికి వినతి

విశాలాంధ్ర-రాయచోటి:117 జీవోను రద్దు చేయాలని అపసను సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించారు. సోమవారం రాయచోటి పట్టణ కేంద్రంలోని మంత్రి కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనానికి సంబంధించిన 117 జీవోను రద్దు చేయాలని అదేవిధంగా సకాలంలో జీతాలు వచ్చే విధంగా చూడాలని మంత్రిని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షులు పరశురాం, జిల్లా మీడియా ఇంచార్జ్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు నాగయ్య జిల్లా కార్యదర్శి చెన్న కృష్ణ వివిధ మండలాల బాధ్యులు మధుసూదన్, రాజా, రాంప్రసాద్ ఇతర కార్యకర్తలు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విందులో పాల్గొన్న సుగవాసి

విశాలాంధ్ర-రాయచోటి:బక్రీద్ పండుగ పురస్కరించుకొని రాయచోటి పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్ వలీ ఇచ్చిన విందులో రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి, టిటిడి పాలక మండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు, ఖాదర్ వలీకి వారి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

త్యాగం,సహనం, దాన గుణం ఐక్యమత్యానికి ప్రతీక బక్రీద్

– రాయచోటి పట్టణంలోని ఈద్గా లో ముస్లిం మైనార్టీ సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలో తమ్ముడు లక్ష్మీప్రసాద్ రెడ్డి తో కలిసి ప్రార్థనల నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేసిన మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి... రవాణా,క్రీడా,యువజన శాఖ మంత్రి...

విశాలాంధ్ర-రాయచోటి:మహనుభావుల త్యాగాలను స్మరించుకుంటూ,భక్తి శ్రద్దలతో ముస్లిం సోదరులు అందరు బక్రీద్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి కోరారు. బక్రీద్ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఈద్గాలో ముస్లిం మైనార్టీ సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలో తమ్ముడు లక్ష్మి ప్రసాద్ రెడ్డి తో కలిసి ప్రార్థనలు నిర్వహించారు .త్యాగనిరతి, దానగుణం,సహనం ఐకమత్యానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్ అని, తమకు కలిగిన దాంట్లో ఇతరులకు కొంత పంచిపెట్టడమనే దాతృత్వాన్ని బక్రీద్ ద్వారా నేర్చుకోవచ్చని మంత్రి అన్నారు. అల్లా ఆశీస్సులు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరిపై ఉండాలని, ఆయన దీవెనలతో రాష్ట్రంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం ముస్లిం మైనార్టీ సోదర సోదరీమణులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.

అధికారుల చొరవతో ఆగిన అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర- సుండుపల్లి : రాయచోటి సుండుపల్లె రాయచోటి సుండుపల్లె ప్రధాన రహదారి పక్కన మండల కేంద్రంలోని అప్పన్నకుంట మొరవ దిగువన వంకలో అక్రమ నిర్మాణాన్ని గత కొన్ని రోజులుగా చేపడుతుండడంతో పలుమార్లు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేకపోవడంతో సోమవారం విలేజ్ రెవిన్యూ అధికారులు విలేజ్ సహాయకులు స్వయంగా వచ్చి అక్రమ నిర్మాణాన్ని ఆపినట్లు తెలిపారు. ఎవరైనా వంకలు,వాగులు, చెరువులు,ప్రభుత్వ స్థలాలను అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తాసిల్దార్ జరిన హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, అలాగే ఎలాంటి ఆపదలు దరిచేరకుండా ప్రజలను కాపాడాలని అల్లాను వేడుకున్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు

విశాలాంధ్ర-పెద్దమండ్యం : త్యాగానికి నిలయం అయినా, ముస్లిం ల పవిత్ర పండుగ అయినా బక్రీద్ పండగ సోమవారం ఘనంగా జరుపుకొన్నారు, పెద్దమండ్యం, కలిచర్ల, వెలిగల్లు, పాపేపల్లి, బండమీదపల్లి, బండ్రేవు, సిద్దవరం, శివపురం, ముసలికుంట, పంచాయతీ లో ముస్లిం సోదరులు నూతన బట్టలు ధరించి ఈ దగ్గ వద్దకు వెళ్లి ప్రతీక ప్రార్థన లు నిర్వహించారు, అనంతరం మసీదు హాజరాత్ భయానా చదివి వినిపించారు, ఆతరువాత ఇంటికి దగ్గర మేకపోతులు, పొట్టేండ్లు కుర్బానా ఇవ్వడం జరిగింది,కుర్బానా ఇచ్చిన మంసాన్ని మూడు భాగలు చేచి ఒక్కభాగం ఇంటి లోనికి, మరొక్క భాగం బంధువుల కు,మిగిలిన భాగం పేదవారికి పంపిణి చెచారు ఈ కార్యక్రమం లో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గతంలో ఉన్న వాలంటీర్లను ఇప్పటి ప్రభుత్వం కొనసాగించాలి

విశాలాంధ్ర - బద్వేలు : 2019 నుంచి 2024 వరకు కొనసాగిన వాలంటీర్ల వ్యవస్థ పాత వాలంటీర్లను కొనసాగించాలని మాల మహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడిగ వెంకటరమణ కోరారు. సోమవారం నాడు మాల మహాసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కరోనా టైం లో సైతం ఎక్కువగా శ్రమించి ప్రజలకు సేవలు అందించి న వ్యవస్థ వాలంటీర్ల వ్యవస్థ అని వృద్ధాప్య పింఛన్ల పంపకం కోసం ఇంటికెళ్లి ఇవ్వడంలో ప్రముఖ పాత్ర వహించారని, వాళ్ల శ్రమను గుర్తించి ప్రస్తుత ప్రభుత్వం వారినే కొనసాగించాలని వారు కోరారు.

అసైన్మెంట్ కమిటీ సమావేశం జరపకుండా ఆక్రమించుకున్న భూములను స్వాధీనం చేసుకోవాలి - సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : వైసిపి ఆరాచక ప్రభుత్వం అసైన్మెంట్ కమిటీ సమావేశం జరపకుండా రెవిన్యూ అధికారులను లోబరుచుకుని దౌర్జన్యంగా ఆక్రమించుకుని దొంగ ఆన్లైన్ చేసుకున్న వారి పై కఠిన చర్యలు తీసుకుని భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు పంచాలని ఎఐటియుసి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు టి రాధాకృష్ణ సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య డిమాండ్ చేశారు.సోమవారం సిపిఐ ప్రధాన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి భూ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలు పని చేసిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కూడ అగ్రవర్ణాలకు లొంగిపోయి అసైన్మెంట్ కమిటీ సమావేశాన్ని పట్టించుకోలేదన్నారు. తెలుగుదేశంపార్టీ హయాం లో జరిగిన అసైన్మెంట్ కమిటీ సమావేశం తప్ప తరువాత జరగలేదన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాలు రైల్వేకోడూరు

ఓబులవారిపల్లి చిట్వేల్ పుల్లంపేట పెనగలూరు మండలాలలో అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయన్నారు.కోడూరు, వెంకటగిరి రోడ్డు, ప్రభుత్వ మార్కెట్ యార్డు కు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి నిరుపయోగంగా ఉందన్నారు.కోడూరు టౌన్ లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ సమస్యను,కొత్త ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరుగుదోడ్ల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చెత్త సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రశాంత వాతావరణంలో తిరుణాల నిర్వహించుకోవాలి

150 మందితో పోలీసులతో గట్టి బందోబస్తు

విశాలాంధ్ర - సుండుపల్లె : ప్రశాంత వాతావరణంలో తిరుణాల నిర్వహించుకోవాలని రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. సోమవారం రాత్రి నాగారపమ్మ తిరుణాల సందర్భంగా అన్నమయ్య జిల్లా ఎస్పి కృష్ణారావు ఆదేశాలతో డి.ఎస్.పి రామచంద్ర రావు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు తెలిపారు. సుమారు 150 మంది పోలీసులతో బందోబస్తు కల్పించడం జరిగిందని తెలిపారు. ఏవైనా సమస్యలు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తిరునాళ్లలో పరిసర ప్రాంతాల్లో మద్యం అమ్మకుండా గట్టి చర్యలు చేపట్టామన్నారు.

సుందరయ్య నగర్‌లో జనసైనికుల పర్యటన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక పరిధిలోని సుందరయ్య నగర్‌లో సోమవారం జనసేన పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దేరంగుల జగదీష్ పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. కాలనీకి చెందిన పార్టీ నాయకులు అమృత్, ధీరజ్ ఆహ్వానం మేరకు ఇక్కడికి రావడం జరిగిందని జగదీష్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జగదీష్‌ను పూలమాలలు, దుశ్శాలువలతో శ్రేణులు సత్కరించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిల సహకారంతో సుందరయ్య నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, హాజీబాష, మహేష్, మల్లి, వీరా, సురేంద్ర, మణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

24 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రూ.97వేలు నగదు స్వాధీనం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పేకాట స్థావరాలపై సోమవారం దాడులు నిర్వహించిన ఎర్రగుంట్ల పోలీసులు 24 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.97,710 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నిడిజువ్వి, పోట్లదుర్తి గ్రామాలలో జూద స్థావరాలపై స్థానిక పోలీసులు దాడులు చేశారు. నిడిజువ్వి గ్రామంలో గత ఐదేళ్లుగా పేకాట జూదం కొనసాగుతున్న

విషయం రహస్యమే. పోలీసుల దాడులలో నిడిజువ్వి గ్రామంలో 16 మంది జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుండి రూ.72,750 నగదు, అలాగే పోట్లదుర్తిలో 8 మందిని అరెస్టు చేసి రూ.24,960 నగదును స్వాధీనం చేసుకున్నారు. అయితే మరో ఇద్దరు తప్పించుకొని పారిపోయినట్లు సమాచారం. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అమీర్ బాబుకు సత్కారం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ముస్లిం సోదరులకు ఎంతో ముఖ్యమైన పండగ అయిన బక్రీద్ పండగ శుభ సందర్భంగా సోమవారం నా టిడిపి జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెండ్ల దస్తగిరి కడప టిడిపి నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ అమీర్ బాబుకు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఆ సందర్భంగా ఆయన మాటాడుతూ రాబోవు రోజులలో అమీర్ బాబు టిడిపిలో ఉన్నత పదవులు చేపట్టాలని ఆయన అన్నారు. టిడిపి సేవలందించిన ప్రతి ఒక్కరినీ గుర్తింపు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకురాలు దస్తగిరి అమ్మ. రేష్మ షామీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలో ఎమ్మెల్యే పుట్టా

విశాలాంధ్ర - మైదుకూరు : మైదుకూరు నంద్యాల రోడ్డులో ఈద్గా నందు బక్రీద్ పండుగ సందర్బంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆయన మాట్లాడుతూ స్వార్థం అసూయ రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశం అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమనది బక్రీద్ సారాంశం అజ్రత్ ఇబ్రహీం త్యాగ నిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులు అందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఈ సమావేశంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. నృత్యాభినయం

విశాలాంధ్ర-పులివెందులం :పట్టణ పరిధిలోని శిల్పారామంలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం పరిపాలనాధికారి సుధాకరం, సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినసాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. ముందుగా పండుగ పూట అందరు ఈద్ ముభరక్ అని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ సూర్య, సూర్య డ్యాన్స్ అకాడమీ, మదనపల్లి వారి శిష్య బృందంచే జానపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా గణనాయకాయ గణ దైవతాయ నృత్యంతో మొదలై హే కందిచేను కాడ..., దండకడియాల్ ...ఉరుముల రమ్మంటినే మెరుపుల రమ్మంటినే, బంగారా బంగారా తదితెర పాటలకు కళాకారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అలాగే పద్మవ్యూహంలో చక్రధారి మూవీ టీమ్ అయినటువంటి హీరో ప్రవీణ్ రాజ్ కుమార్, హీరోయిన్ శశిక, డైరెక్టర్ సంజయ్ రెడ్డి వారి చేతుల మీదుగా మిని టెలివిజన్ లో బావ బావ ఓ బావ అను రాయలసీమ లిరికల్ ఫోక్ సాంగ్ రిలీజ్ చేయబడినది. దీనికి డైరెక్టర్ అండ్ కొరియోగ్రాఫర్ ఏస్.కె మాస్టర్ సంగీత దర్శకుడు బాబ్, సింగర్ జానకి హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌సిఎం ఎయిడెడ్ పోస్టుల అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి

ఎయిడెడ్ పోస్టుల భర్తీలో నాలుగు కోట్ల కుంభకోణం

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. ఎం.ఓబులేసు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆర్ సి ఎం ఎయిడెడ్ పాఠశాల లలో గత 25 సంవత్సరాలుగా తక్కువ జీతాలతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పోస్టింగ్స్ ఇవ్వకుండా బిషఫ్ గాలి బాలిరెడ్డి అన్యాయం చేస్తున్నారని బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. ఎం.ఓబులేసు, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. కడప మరియాపురం చర్చి దగ్గర నుండి బిషప్ హౌస్ వరకు ర్యాలీ నిర్వహించి బిషప్ హౌస్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఎయిడెడ్ పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వచ్చిందని ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో కడప డయాసిస్ ఆర్సియంలో దాదాపు గత 20 సం"ల తరువాత ఎయిడెడ్ ఉద్యోగాల భర్తీకి గవర్నమెట్ నుండి అనుమతి వస్తుందని అర్సీమ్ డయాసిస్ లోని పాఠశాలలకు దాదాపు మొత్తం 29 ఉద్యోగాలకు అనుమతి వచ్చిందన్నారు అందులో ఎస్‌జీటీ 15, బిఈడి -14 మొత్తం-29. అన్ ఎయిడెడ్ ఉపాద్యాయులైన మేము సుమారుగా 23 సం నుండి కేవలం 600 రూపాయలనుండి 4000 వేలు చాలీచాలని జీతంతో మన అర్సీమ్ సంస్థలో ఎప్పటికైనా ఎయిడెడ్ పోస్ట్ వస్తుందనే నమ్మకంతో గంపెడు ఆశతో, అంగవైకల్యమును లెక్క చేయక ఎన్నో కిలోమీటర్లు ప్రయాణించి సమస్తకోసం, మా జీవితాల కోసం పనిచేస్తూ వచ్చారన్నారు . ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది అంటే మా అదృష్టంగా భావించి ఇన్ని ఏండ్ల కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని ఆశించాం అయితే బిషప్ గారు వారి ఆశలు నిరాశలుగా మార్చాలని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్త అభివృద్ధి కోసం ఎన్ని ఏండ్లు మాతో పెట్టి చాకిరి చేయించుకుని నిర్దాక్షిణ్యంగా వేరే వారికి పోస్టింగ్స్ కు లక్షల రూపాయలు ముడుపులు తీసుకుని పోస్టింగ్స్ వేస్తున్నారంటే అర్థం కాని అయోమయ పరిస్థితులలో ఉన్నారన్నారు. ఆర్సీమ్ సంస్థలలో పనిచేయని రోస్టర్ పాయింట్స్ లో లేని కొత్త వ్యక్తుల నుండి ఒక్కొక్క పోస్ట్ కు 30 లక్షల నుండి 45 లక్షల వరకు మాకు రావలసిన ఉద్యోగాలను ఇప్పటికే 12 ఉద్యోగాలను అమ్ముతున్నట్లు, మరికొన్ని ఉద్యోగాలను కమిటీలో వున్న ఫాదర్స్ కుటుంబీకులకు, బందువులకు, బిషప్ గాలి బాలిరెడ్డి రెకమెండేసన్ కు, రెండవ బిషప్ డ్రైవర్ జార్జ్ రెకమెండేసన్ మరికొన్ని ఉద్యోగాలను ఇప్పటికే ఇవ్వటం జరుగుతున్న ఈ నేపథ్యంలో బాధిత ఉపాధ్యాయులకు చాలా ఆందోలనలకు,మానసిక క్షోభకు గురిచేస్తుంది ఉపాధ్యాయులకు జరగదానిది ఏది జరిగినా బిషప్ గారే బాధ్యత వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత ఉపాధ్యాయులు కవిత, ప్రమీలారాణి, వెంకటసుబ్బయ్య,శేఖర్, ప్రమీల,ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తులసిరెడ్డిని కలిసిన ఆళ్లగడ్డ కాంగ్రెస్ అభ్యర్థి.

విశాలాంధ్ర-వేంపల్లె: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ అసెంబ్లీకి ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసిన బరుగుడ్ల హుస్సేన్ భాషా సోమవారం వేంపల్లి లో కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మెన్ డాక్టర్ ఎన్ తులసిరెడ్డిని కలుసుకున్నారు. ఎన్నికల తీరుతెన్నుల గురించి,రాబోవు రోజుల్లో పార్టీ పటిష్టతకు తీసుకోవలసిన చర్యలు గురించి ˘ర్చించుకున్నారు. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమని,పెద్దపెద్ద నాయకులు కూడా ఓడిపోయిన సందర్భాలు వున్నాయని ,నిరుత్సాహ పడకుండా ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు పోవాలని తులసి రెడ్డి ఉద్బోధించారు. ఈ సందర్భంగా ఎన్నికలల్లో సహకారం అందించిన తులసి రెడ్డిని పూలమాలతో, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమర్నాథ్ రెడ్డి,సాదిక్, హుస్సేన్, నజీర్,చాంద్,మాబూ భాషా తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రజా సమస్యల పరిష్కారమే ఎన్డీయే ప్రభుత్వ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో సోమవారం ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సమస్యలను ఆలకించారు. వివిధ సమస్యలపై వచ్చిన వినతులను స్వీకరించారు. అలాగే రామ గోపాల్‌రెడ్డిని పలువురు టీచర్స్ అదే విధంగా ఉన్నతాధికారులు, అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట డాక్టర్ మల్లీశ్వరి, డిప్యూటీ సూపరిండెంట్ విఘ్నేశ్వరరావు, ఏడ డాక్టర్ వినయ్, డాక్టను నవీన్‌లు కూడా రామగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకని శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల అనంతరం కొత్తగా ఏర్పడిన ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనంతరం ఆర్‌అండ్‌బి అతిధి గృహంలో రామగోపాల్‌రెడ్డి అందుబాటులో ఉండటం పట్ల ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

విద్యుత్తు పెద్ద లైను తగిలి లారీ ధ్వంసం, మహిళ మృతి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండలం అనంతరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని స్టీల్ ప్లాంట్ సమీపంలో బొప్పాయి లారీ విద్యుత్తు షాక్ కు లారీ ధ్వంసం అయింది. ఓ మహిళ మృతి చెందింది. సోమవారం ఉదయం మండల కేంద్రం టౌన్ లో నుండి బొప్పాయి వ్యాపారి దళారి బుర్రు మురళి యాదవ్ ఆర్ జె 07 జిబి 9451 నెంబర్ గల రాజస్థాన్ లారీలో బొప్పాయి కూలీలను తీసుకొని వెళ్లాడని మృతురాలు అన్న బాలు నాయక్ తెలిపాడు. అనంతరాజుపేట గ్రామపంచాయితీ లో బొప్పాయి తోటలో కాయలు కొచుకుని మరో తోట వద్దకు వెలుతున్న సమయంలో లారీ డ్రైవర్ విద్యుత్ వయ్యర్లు కింద ఉన్నాయా, లేవా చూసుకోకుండా నిర్లక్ష్యం నడపడం వలన విద్యుత్తు షాక్ తగిలి లారీ పూర్తిగా కాలిపోయింది.మంటలు లేచిన సమయంలో లారీలో ఉన్న బొప్పాయి కూలీలు భయాందోళనతో ఒక్క సారిగా లారీ నుండి కిందికి దూకడంతో ఓ మహిళ మంగమ్మ (32), మృతి చెందింది.అనంతపురం జిల్లా నుంచి జీవనోపాధి కోసం కోడూరు కు వచ్చారు. ఎర్రచందనం తోట ఎదురుగా గుడిసే వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గాయాలకు గురైన వారిని గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.పోష్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ఎస్ఐ అద్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతురాలికి భర్త ముగ్గురు మగపిల్లలు ఒక ఆడ పాప వుంది. లారీ అగ్నిప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే ఫైర్ ఆఫీసర్ కె విజయ్ కుమార్ ఆద్వర్యంలో వారి సిబ్బంది ఫైరింజన్ తో హుటాహుటిన సంఘటనా వెళ్లి మంటలను ఆర్పివేశారు.

చిరస్మరణీయులైన చిలకమర్తి లక్ష్మీ నరసింహం

గణనీయమైన కీర్తి తెచ్చిన గయోపాఖ్యానం.. ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

విశాలాంధ్ర-కడప వైవీయూ : కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయులు, సంఘసంస్కర్త, విద్యావేత్త అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం గారికి అఖండమైన కీర్తి తెచ్చి చిరస్మరణీయుని చేసింది ఆయన రాసిన గయోపాఖ్యాన నాటకమేనని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో సోమవారం చిలకమర్తి 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయస్సులో రాసిన గయోపాఖ్యానం ప్రతులు అప్పట్లోనే లక్షకు పైగా అమ్ముడుపోవడం విశేషం అన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిల్టన్ గా ప్రసిద్ధులైన చిలకమర్తి ఆ కాలంలోనే దళితులకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు.డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఆయన ఎన్ని కథలు, నవలలు, నాటకాలు, అనువాదాలు రాసిన గయోపాఖ్యానమే మంచి కీర్తి తెచ్చింది అన్నారు. సత్యనారాయణ చిలకమర్తి ఆసువుగా చెప్పిన పద్యాలను చక్కగా ఆలపించారు. ఈ సందర్భంగా గయోపాఖ్యానం నాటకంలో ప్రసిద్ధ

పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న ఆమూరు విశ్వనాథరెడ్డి, భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి రామచంద్రయ్య, కర్నాటి నరసింహ రెడ్డి, పట్నం సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. రంగస్థల కళాకారులైన మందల మురళి, బ్యాంకు గంగయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, తపలిస్ట్ గంగయ్య, రవీంద్రనాథ్ రెడ్డి గయోపాఖ్యానం నాటకంలోని పద్యాలను మధురంగా గానం చేశారు.

పీఠాధిపతి ఆరిపుల్ల హుస్సేన్, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా సన్మానించిన అమీర్ బాబు



విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని బిల్డప్ దగ్గరలో ఉన్న ఈద్గా బక్రీద్ వేడుకలలో పాల్గొన్న కడప అమీన్ పీర్ పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిపుల్లా హుసేని ని, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. ఎస్. అమీర్ బాబు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం అమీర్ బాబు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మన రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరూ బక్రీద్ పండుగ జరుపుకొని అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని చెప్పి మన ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ని అఖండ మెజార్టీతో గెలిపించిన రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరికీ అన్ని వర్గాలకు చెందిన రాష్ట్ర ప్రజలందరికీ ఆ అల్లా ఆశీస్సులు అన్నివేళలా ఉండాలని చెప్పి ప్రత్యేకమైన ప్రార్ధనలు చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో వి ఎస్ అమీర్ బాబు తనయుడు డాక్టర్ . వి ఎస్ ఆదిల్, రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టాకు పత్రా సంఘం నాయకుల వినతిపత్రం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలో ఉన్న పట్టా సంఘం నాయకులు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు వినతి పత్రాన్ని సోమవారం ఆయన నివాసంలో రేకులకుంట గ్రామానికి చెందిన పత్రా సంఘం నాయకులు కొండా నారాయణ, కొండా ఓబయ్య, సాంబయ్య, జయరాం నాయుడు, మల్లికార్జున నాయుడుతో పాటు కొంతమంది కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనకు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పత్రా సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలో 90శాతం పత్రా వాళ్లు తెలుగుదేశం పార్టీలో ఉన్నారని జరగబోయే ఎన్నికలలో పత్రా కులానికి చెందిన వారిని గుర్తించి నామినేట్ పోస్టులు ఇవ్వాలని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రత్యేక కార్పొరేషన్‌ను కల్పించాలన్నారు. అనంతరం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు లాయర్ పట్టాభి జయరాం నాయుడు, శేఖర్, నాగరాజు ఆచారి, ధర్మానాయుడుతో మరో కొంతమంది కలిసి ఎమ్మెల్యే పుట్టాను ఘనంగా సన్మానించారు.

ఘనంగా సీతారామ స్వామి ఆలయంలో వార్షికోత్సవం



విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి ఆశీస్సులతో పాతూరు గ్రామంలో వెలసి ఉన్న సీతారాములస్వామి ఆలయంలో నూతన గుడిని ఏర్పాటు చేసి సంవత్సరం కావడంతో ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా శుద్ధ ఏకాదశి కావడంతో ఘనంగా వార్షికోత్సవాన్ని చేపట్టారు. ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు వేద పండితుల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక అన్నదాన కార్యక్రమాలు చేపట్టి సీతారాముల స్వామి ఆశీస్సులు బ్రహ్మంగాని నివాసం గృహం వద్ద కార్యక్రమాన్ని చేపట్టడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాతూరు గ్రామ ప్రజలతో పాటు బ్రహ్మంగారిని దర్శించుకున్న దానికి వచ్చిన భక్తులు కూడ ప్రత్యేకంగా హోమంలో దంపతులు ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన ఎన్‌జీఓ నేతలు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని రాయచోటి లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపియన్జిజివో ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఎం.వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి డి.వెంకటేశ్వర్ రెడ్డి, మంత్రి వర్యులు మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్నా మీకు అండగా ఉంటానన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందించలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా కోశాధికారి పి.నిత్యపూజయ్య, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, నరసింహ రెడ్డి, యన్.రాజ శేఖర్, రాయచోటి యన్ జి వో నాయకులు బి.దేవేంద్ర, మహాదేవ, గణేష్ యాదవ్, అల్లీ బాష, కడప సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, నాగార్జున రావు , పద్మనాభ రావు, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు కె.బలరామ రాజు, ఉపాధ్యక్షులు సి.విశ్వనాథం పాల్గొన్నారు.

నగర శివారులో ఘోర ప్రమాదం

కారు బస్సు ఢీ : డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి మృతి
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కడప : కడప నగర శివారు రిమ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడప చెన్నై ప్రధాన రహదారిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది వేగంగా ప్రయాణిస్తున్నటువంటి బస్సును కారు ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగ మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. వివరాల్లోకెళితే సోమవారం ఉదయం కడప మండలం ఉక్కాయపల్లి చెందిన దాది బోయిన రాజమోహన్ అలియాస్ రాజా తన భార్య లక్ష్మీదేవి, కుమారుడు సాయి గురు రోహిత్ (25) తో కలిసి అద్దెకు కారు తీసుకొని కడప కో-ఆపరేటివ్ కాలనీ చెందిన డ్రైవర్ దూది రామయ్య(55)తో కలిసి పోరుమామిళ్ల దగ్గర ఉన్నటువంటి గుర్రప్ప కొండకు వెళ్లారు. వీరు తిరిగి కడపకు మధ్యాహ్నం 3 గంటల సమయంలో వస్తుండగా కడప నగర శివారులోని డిఆర్డిఏ భవనం సమీపంలో గల ప్రధాన రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది, కారు కడప వైపుకు వస్తుండగా కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్నటువంటి ఆర్టీసీ బస్సు ఢీకొనడం జరిగింది, ఈ ప్రమాదంలో ఏపీ 07 డి ఈ 5129 కారులో ప్రయాణిస్తున్నటువంటి డ్రైవర్ రామయ్య తోపాటు, రాజమోహన్ కుమారుడు సాయి గురు రోహిత్ అక్కడికక్కడే మరణించగా ఉక్కాయిపల్లి రాజా అతని భార్య లక్ష్మీదేవి తీవ్ర గాయాల పాలయ్యారు. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న వెంటనే కడప రిమ్స్ ఎస్సై నారాయణ, పోలీసులు ఘటన స్థలము చేరుకొని మృతదేహాలను, గాయాల పాలైన ఇద్దరిని కూడా రిమ్స్ హాస్పిటల్ కు తరలించారు, ప్రస్తుతం రాజా అతని భార్య హాస్పటల్లో చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాటం చేస్తున్నారు, రాజా కుటుంబానికి ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో ఉక్కాయిపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై కడప రిమ్స్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని ముడమాల, రాజుపేట, సోమిరెడ్డిపల్లె, పలుగురాళ్లపల్లెతో పాటు వివిధ గ్రామాలలో ముస్లిం సోదరులతో పాటు దూదేకుల కులానికి ప్రత్యేకంగా బక్రీద్ పండుగను వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సమేతంగా కుటుంబసభ్యులు ఎంతో పవిత్రమైన బక్రీద్ పండుగను వేడుకలు ప్రత్యేక ప్రార్ధనలు చేపట్టి తమ భక్తిని చాటారు. ముస్లింల రెండు ముఖ్యమైన పండుగలలో ఒకటి బక్రీద్ అని అన్నారు.

తాటి బెల్లం కేఫ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక కొత్త పల్లె బైపాస్ సర్కిల్‌లో శ్రావన్‌కుమార్ రెడ్డి ఆహ్వానం మేరకు నెల్లై తాటిబెల్లం కేఫ్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు.ఈ సంధర్భంగా ఆయనకు శ్రావన్ కుమార్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. చిరు ధాన్యాలతో చేసిన వంటకాలు అన్ని దొరుకుతాయని వీటి వల్ల ఆరోగ్యం బాగుంటుందని నిర్వాహకుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, నాయకులు చదిపిరాళ్ల వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షర శిల్పి రామోజీరావుకు అంజలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఈనాడు సంస్థల అధినేత స్వర్గీయ చెరుకూరి రామోజీ రావుకు అన్నమయ్య ఆర్ట్స్ అకా డమీ గంగుల ఫౌండేషన్ అధ్యక్షుడు గంగుల రామచంద్ర రావు ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక వైయస్సార్ ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ రామోజీ రావు చేసిన ప్రజాయిత కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ జర్నలిజానకి కొత్త వరవడి సృష్టిస్తూ రైతుల కు అండగా మార్గదర్శిగా అన్నదాత పత్రికను రైతులకు అందిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలకు కళాకారులకు అండగా నిలిచిన మహానేత కు నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య ఆర్ట్స్ అకాడమీ ఉపాధ్యక్షుడు షరాబు నరసింహాచారి, అన్నమయ్య ఆర్ట్స్ అకాడమీ సభ్యులు చౌడం జయశంకర్ లు పాల్గొన్నారు.

21న "పద్మవ్యూహంలో చక్రధారి"విడుదల

విశాలాంధ్ర-కడప: రాయలసీమ కథాంశంతో రూపొం దుతున్న " పద్మవ్యూహంలో చక్రధారి" సినిమా ఈ నెల 21న విడుదల కానుందని ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని ఆ సినిమా డైరెక్టర్ సంజయ్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు సీమ ప్రాంతంలో ఫ్యాక్షనే కాకుండా ప్రేమ, ఆప్యాయతలు ఉంటాయని దీనిని కథాంశంగా తీసుకుని రూపొందించామని చెప్పారు. ఈ సినిమాను పూర్తిగా కడప జిల్లాలోని పులివెందుల,బలపనూరు,కసనూరు, అంకాలమ్మ గూడూరు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరిపామన్నారు. అనంతరం హీరో ప్రవీణ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ తాను రాయచోటికి చెందిన వాడినని ఇది వీసి క్రియేషన్స్ బేనర్ పై తీయడం జరిగిందని చెప్పారు ఇది స్వచ్ఛ మైన లవ్ స్టోరీ అన్నారు. హీరోయిన్ శశిక మాట్లాడుతూ ఇందులో 4 పాటలు ఉన్నాయని ఇది పూర్తిగా ఎంటర్టైన్మెంట్ సినిమా అన్నారు. ఈ నెల 21న విడుదల కానుందని ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. ఈ సమావేశంలో మరో డైరక్టర్ వేమారెడ్డి, టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నూతన నగర కమిటి ఎన్నిక

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని గీతా శ్రమంలో నిర్వహించిన సమావేశంలో ఏబీవీపి నూతన ప్రొద్దుటూరు నగర కమిటీ ఎన్ను కున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా వెంకటేశ్వర కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరిశంకర్, ఏఓ పృద్వి నారాయణ, ఏబీవీపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున పాల్గొని నూతన బాధ్యతలను ప్రకటించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీటి ఈ దేశంలో 75సంవత్సరాల నుండి విధ్యార్థుల అనేక సమస్యల కోసం పనిచేస్తున్న సంస్థ ఏబీవీపి అన్నారు. ఒక క్రమశిక్షణ గల సంస్థ అన్నారు. వివేకానందుని స్ఫూర్తితో సమాజంలో పనిచేసే ఏకైక సంస్థ అని, అలాగే ఏబీవీటి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. కన్వీనర్‌గా శరణ్, నగర కార్యదర్శిగా శివ నారాయణ, నగర సహాయ కార్యదర్శులుగా శివాజి, అభినయ్, ఎస్ఎఫ్‌డి కన్వీనర్‌గా సంతోష్, సుదర్శన్, యస్‌యఫ్‌యస్ కన్వీనర్‌గా వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్‌గా సోహైల్, హాస్టల్ కన్వీనర్‌గా శ్రవణ్ ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతే బక్రీద్

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

విశాలాంధ్ర-మదనపల్లి: ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతియే బక్రీద్ పండుగ పరమార్థం అని ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా అన్నారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని ఆయన తెలిపారు. దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతి ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని ఆయన కోరారు. దేవుడి దయతో ప్రజలందరూ ఆరోగ్యాలు, సుఖ శాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మత సామరస్యం వెల్లివిరియాలన్నారు. సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక బెంగుళూరు రోడ్డులోని ఈద్గ వద్ద నిర్వహించిన ప్రత్యేక పార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా వైసిపీ నాయకులు నిసార్ అహ్మద్, కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్ లు బక్రీద్ ప్రార్థనల్లో ముస్లిం సోదరుల కు, పట్టణ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పీలేరులో ఘనంగా బక్రీద్ వేడుకలు

విశాలాంధ్ర-పీలేరు: పీలేరు పట్టణంలో ఆదివారం ఘనంగా బక్రీద్ వేడుకలు జరిగాయి. పట్టణంలోని మదనపల్లె రోడ్డు మార్గంలో గల బోధేశావలి దర్గా సమీపంలో ఉన్న ఈద్గా మైదానం వద్ద పీలేరు లోని పలు మసీదులలోని ముత్తవల్లిలు ముస్లిం సోదరులు ఐకమత్యంగా అల్లాను ప్రార్థిస్తూ ఈద్గా వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా మత పెద్ద గురువు తన అమూల్యమైన సందేశాన్ని ఇస్తూ ముస్లింలకు ప్రధానమైన రెండు పండగలు అయితే అందులో ఒకటి రంజాన్ రెండవది బక్రీద్ అని తెలిపారు ఈ పండుగకు ఈదుల్ అజాహ ఈద్ జుహా లేక బక్రీద్ అని కూడా పిలుస్తారని అన్నారు అల్లాహు ఆదేశానాం ఆదేశానుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి సిద్ధమవుతాడు ఆ సాంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. ధర్మమంటే దానగుణం ముడిపడి ఉన్నదే మానవ ధర్మమని మతం ఏదైనా మానవత్వం గొప్పదని ఆయన చాటి చెప్పారు. ఈ పండుగనాడు గొప్ప త్యాగానికి ప్రత్యేక అని ఆయన తెలిపారు ఆయన సందేశం అనంతరం ముస్లిం సోదరులు సామూహిక ప్రార్ధనలో పాల్గొన్నారు ప్రార్థన అనంతరం ఒకరినొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు ఈ సందర్భంగా పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి ఈద్గా వద్ద ఎలాంటి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేశారు.

బక్రీద్ అంటేనే త్యాగానికి ప్రతీక

ఇబ్రహీం ప్రవక్త ఆచరించిన మార్గం ప్రతి ముస్లింకి ఆదర్శనీయం

విశాలాంధ్ర-గుర్రంకొండ: ఇస్లాం మత సూత్రాలలో ఇదొకటి. త్యాగ నిరతితోపాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలో ప్రధాన పరమార్థం దాగి ఉందని అన్నారు. ఈ సందర్భంగా మత గురువు ఈద్గా మైదానంలో వేలాదిమంది ముస్లింల ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో తండ్రికి కొడుకు ఉండవలసిన సంబంధం గురించి వివరించారు. ఇబ్రహీం సలీల్లా ఇస్మాయిల్ జబీబుల్లా యొక్క త్యాగాలను స్మరించుకున్నారు స్థానిక మసీదుల నుంచి ఈద్గా మైదానానికి కాలినడకన వెళ్లి ముస్లిం సంప్రదాయాల ప్రకారం నమాజును ఆచరించారు అనంతరం ఒకరిని ఒకరు ఈద్ ముబారక్ అంటూ అలింగనం చేసుకున్నారు అనంతరం తమ సామర్థ్యాన్ని బట్టి మాంసాలను పేదలకు పంచి పట్టారు.

తాగునీరు వృధా

విశాలాంధ్ర- రామస ముద్రం : తాగునీరు వృధాగా పోతున్న పట్టించుకుని నాధుడే లేదు మండలంలోని ఆర్ నడుంపల్లి పంచాయతీ గుండె వారి పల్లి గ్రామంలో త్రాగునీరు రోడ్డుమీద నిరుపయోగంగా పోతోంది ఇప్పటికి కొన్ని గ్రామాలలో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు నీరు రోడ్డు మీద వృధాగా పోతుండడం వల్ల రోడ్డు దెబ్బతినడమే కాకుండా నీటి సమస్య ఏర్పడే ప్రమాదం లేకపోలేదు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వృధా నీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మండలంలో ఏ ప్రైవేట్ పాఠశాలకు గుర్తింపు లేదు

విశాలాంధ్ర-పీలేరు : పీలేరు మండలం లో ఏ ప్రైవేట్ పాఠశాలకు గుర్తింపు లేదని పీలేరు మండల విద్యాశాఖాదికారి వై. లోకేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటలాడుతు విద్యార్థి సంఘాల నాయకులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇంతవరకు పీలేరు మండలం లోని ఏ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాల కు, తపశ్యా స్కూల్ తో సహా %జదీూజు% గుర్తింపు లేదని తెలిపామని అన్నారు .రాష్ట్ర ప్రభుత్వం నుంచి %చీూజ% వచ్చినంత మాత్రాన గుర్తింపు వచ్చినట్లు కాదని నుండి ప్రత్యేక గుర్తింపు పొందాలని అలాగే గుర్తింపు నెంబర్ కూడ కేటాయిస్తారని తెలిపారు.అప్పుడే సంపూర్ణ గుర్తింపు పొందినట్లు. ఈ విషయం లో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా వుందని తెలిపారు.ఏవైనా సందేహాలు వుంటే విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి న పాఠశాలల పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మండల విద్యాశాఖాధికారి తెలిపారు.

జల సంరక్షణ గురించి కంద పద్య గాన మురళికి సన్మానం

విశాలాంధ్ర-పీలేరు: పీలేరుకు చెందిన తెలుగు భాషా సమితి నిర్వాహకులు జలకనూరి మురళీధర్ రాజు కు ఘన సన్మానం జరిగింది.తాను స్వీయ రచన చేసిన జల సంరక్షణ గురించి కంద పద్య గానాన్ని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛేర్మేన్ కత్తిమండ ప్రతాప్,మరియు రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శి దనాసి ,ఉషారాణి ఆధ్వర్యంలో 135వ జాతీయ శతాధిక కవిసమ్మేళ%శీ% లో భాగంగా తిరుపతి విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ తెలుగు శాఖ ఆడిటోరియంలో జరిగిన శ్రీ శ్రీ కళావేదిక ఆహ్వానం మేరకు జలకనూరి మురళీధర్ రాజు తాను స్వీయ రచన చేసిన జల సంరక్షణ గురించి కంద పద్య గానాన్ని వినిపించారు. అందులకు గాను ఆయనని గౌరవప్రదంగా శాలువా, జ్ఞాపికా ప్రశంశా పత్రంతో ఆ సంస్థ అధిపతి కత్తిమండ ప్రతాప్, నిర్వాహకులు ధనాశి ఉషారాణి,కన్వీనర్ కొల్లి రమావతి , మరియు హేమమాలిని, మొదలగు వారిచేత సన్మానం తో సత్కారాన్ని పొందుపరిచారు.

ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడిగా డాక్టర్ కరుణాకర్ అరమడక

విశాలాంధ్ర-పీలేరు:-అన్నమయ్య జిల్లాకు ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షుడిగా మదనపల్లికి చెందిన డాక్టర్ కరుణాకర్ ఆరమడక నియమితులయ్యారు. ఈ మేరకు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు జెయన్ రాజేంద్ర, కేంద్ర కార్యదర్శి వాసవి సోమవారం నియామక పత్రాన్ని అందించడం జరిగింది. 2024 జూన్ 17 నుండి 2025 జూన్ 16 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సినీ హబ్ నిర్మాణానికి ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో షూటింగ్ లకు అనువుగా ఎన్నో అతి సుందరమైన ప్రదేశాలున్నాయని, సక్రమ మార్గంలో తన వంతుగా బాధ్యతలు నిర్వర్తిస్తానని చెబుతూ, తనను అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించిన ఫిల్మ్ ఛాంబర్ అఫ్ కామర్స్ కి డాక్టర్ కరుణాకర్ ఆరమడక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

కోళ్లబైలు పంచాయతీలో భూకబ్జాలు అరికట్టాలి

విశాలాంధ్ర-మదనపల్లి: మదనపల్లె రూరల్ మండలం, కోళ్లబైలు పంచాయతీ లో భూకబ్జాలు అరికట్టాలని సోమవారం కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన కూడా ఆ స్థలాన్ని కబ్జారాయుళ్లు ఎధేచ్ఛగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రజా పాలకులు, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి భూ కబ్జా దారులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోళ్ల బైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 612, 529 లలో రెవిన్యూ సిబ్బంది కొంత ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికి సదరు స్థలం పై కన్నేసిన కొందరు నకిలీ పట్టాలు తయారు చేసుకుని రాత్రిళ్లు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కబ్జాదారుల ఆటలకు వత్తాసు పలికారని కనీసం ఇప్పుడైనా తెదేపా ఎమ్మెల్యే దీనిపై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కాలనీకి అవసరమయ్యే కమ్యూనిటీ హాలు, పార్కు లాంటివి నిర్మించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

విశాలాంధ్ర-మదనపల్లి : త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, అలాగే ఇబ్రహీం ప్రవక్త ఆచరించిన మార్గం ప్రతి ముస్లింకి ఆదర్శనీయ మని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నేత షేక్ రెడ్డీ సాహెబ్ వెల్లడించారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించు కుని సోమవారం మీడియాతో షేక్ రెడ్డీ సాహెబ్ మాట్లాడారు. ఇస్లాం మత సూత్రాలలో బక్రీద్ ఒకటి అన్నారు .త్యాగ నిరతితోపాటు మనో వాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగలో ప్రధాన పరమార్థం దాగి ఉందని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నేత షేక్ రెడ్డీ సాహెబ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మదనపల్లె ముస్లిం సోదరులకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగ పర్వదినంలో భాగంగా రెడ్డీ సాహెబ్ స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలసి బక్రీద్ శు భాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా బొకే అందజేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.గతంలో ఒకమారు మదనపల్లెని అభివృద్ధి పథంలో నడిపిన ఎమ్మెల్యేగా షాజహాన్ బాషాకు అపూర్వ అనుభవం ఉందని కొనియాడారు.అందరి వాడుగా అందరి మదిలో నిలిచిన ఆయనకు మరోమారు మదనపల్లెని అభివృద్ధి దిశగా నడిపించే అవకాశం ఆ భగవంతుడు కల్పించడం సంతోషదాయకం అన్నారు. షాజహాన్ భాష ఆధ్వర్యంలోని నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే చేదోడు వాదోడుగా ఉంటారన్న విషయం అందరికీ విధితమే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రామసముద్రం : మండలం లోని ఆర్ నడుంపల్లి పంచాయతీ నల్లప్ప గారి పల్లి చెందిన నారాయణస్వామి (50) మృతి చెందాడు. రెండు రోజుల క్రితం అన్నదమ్ములు వారసత్వంగా వచ్చిన ఆస్తిని తనకు వాటా ఇవ్వలేదని మనస్థాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు ఈ విషయమై రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.మృతుని భార్య మంజులమ్మ ఫిర్యాదు మేరకు రామసముద్రం ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతునికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

ఎస్టీయూకు విరాళం

విశాలాంధ్ర- పులి వెందుల: ఎస్టీయూకు వైఎస్ వెంకటరెడ్డి విరా ళం ప్రకటించారు. ఆ మేరకు రూ. 20వేల మొత్తాన్ని స్థానిక రిల యన్స్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న తులసి ప్రతాప్ ఫంక్షన్ హాలులో ఎస్టీయూ నాయకులకు ఆయన సోమ వారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సమాజంలో మంచిని విద్యార్థి దశ నుంచే విచ రించే ఉపాధ్యాయ సంఘాలకు విరాళాన్ని అందజేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల భవితవ్యాన్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థులకు దశదిశా నిర్దేశించే దిక్సూచిని సూచించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. భావిభారత పౌరు లుగా తీర్చిదిద్దగల ఉపాధ్యాయుల సంఘాలకు విరాళం అందజేయడం పట్ల తాను గర్విస్తున్నానన్నారు. వీలైనంత వరకు ఉపాధ్యాయ సంఘాల అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయ కులు దాదాపీర్, కృష్ణ, దుష్యంతరెడ్డి, కైలాస్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ద్రౌపతి మాత కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-రామాపురం : మండల కేంద్రమైన రామా పురంలో నిర్వహిస్తున్న మహాభారతి యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపదీమాత కళ్యాణ మహోత్సవం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్రౌపదీ మాత తరపున మద్దిరివుల కుమారి రమేష్ రెడ్డి దంపతులు పాండవుల తరపున అయోధ్యపురం సరస్వతి భగవాన్ రెడ్డి పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోతసవానికి మాజీ శాసనసభ్యుడు గడికోట ద్వారకనాథరెడ్డి పాల్గొని ద్రౌపతి మాత కళ్యాణోత్సవాన్ని తిలకించి పండితులతో ఆశీర్వాదం పొందారు ఈ కళ్యాణోత్సవానికి మండలంలోని ప్రజలు హాజరై కళ్యాణ ఉత్సవాన్ని తిలకించి ఆ ద్రౌపతి మాత కృపా కటాక్షాలు పొందారు. ప్రతిరోజు మాదిరే కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బుశెట్టి రామ్మోహన్ రావు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డికి వాసవి కన్యకాపరమేశ్వరి దేవి(అమ్మవారి శాల) అధ్యక్షులు బుశెట్టి రామ్మోహన్ రావు శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం ఆయనను పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జొన్నలగడ్డ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

భాగవత సప్తాహం ప్రారంభం

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం అంకపల్లె గ్రామంలో వెలసిన గ్రామస్థుల ఆరాధ్యదైవమైన ఆవులస్వామి ఆలయంలో సోమవారం భాగవత సప్తాహం ప్రారంభించారు. పులివెందుల భాగవత సమాజం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ లోకకల్యాణం కోసం ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఇప్పటి నుంచే రైతుకు ఆదాయ వ్యయాలు ప్రారంభమవుతాయన్నారు. రైతుల కష్టాలు భగవంతుడిమీదే ఆధారపడి ఉంటాయన్నారు. అన్ని వేళలా మేలు జరగాలని, ప్రకృతి విపత్తుల నుంచి కాపాడాలని రైతులు దేవుళ్లను వేడుకుంటారని తెలిపారు. ఇదే సమయంలో భాగవత సమాజం కూడా ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సు కోరుకుంటుం దన్నారు. దైవసంకల్పం తోడు ఉంటే ఎంతటి విజయమైనా సాధించవచ్చ న్నారు. తాము కూడా సకాలంలో వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఇటువంటి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు భాగవత సప్తాహం. భగవద్గీత పఠనం వంటి ముఖ్య కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని విజయం చేయాలని వారు విజ్ఞప్తిచేశారు.

కడప నగర సమస్యలను పరిష్కరించండి

కడప ఎమ్మెల్యే మాధవికి అభ్యుదయ వేదిక విజ్ఞప్తి!

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప శాసనసభ నియోజకవర్గానికి నూతనంగా శాసన సభ్యురాలిగా ఎన్నికైన మాధవి ని కలిసి అఖిల భారత అభ్యుదయ వేదిక జిల్లా నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా వారు కడప నగరంలో నెలకొన్న పలు సమస్యలను సత్వరమే పరిష్కరిం చుటకు గాను కృషి చేయగలరని,భవిష్యత్తులో కడప నగరాన్ని మంచి ప్రగతి పథంలో నిలుపగలరని ఆమెకు విజ్ఞప్తి చేశారు. అందుకు గాను ఎమ్మెల్యే మాధవి రెడ్డి స్పందిస్తూ కడప నగర అభివృద్ధి గాను రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో ప్రణాళికా బద్ధంగా తనవంతు కృషిచేసి కడప నగరాన్ని ప్రగతి పథంలో నిలుపుతానని అన్నారు.ఇందుకు గాను అందరి సహాయ సహకారాలు తీసుకుని,అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామని అన్నారు. ఎమ్మెల్యేను కలిసి అభినందించిన వారిలో అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు కె. సురేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు బి. విశ్వనాథ, ప్రధాన కార్యదర్శి పి. శంకరయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు యస్.మహబూబ్ బాషా,పి. హైదర్ అలీ,కె.గౌరీశంకర్,వి.కృష్ణ తదితరులున్నారు.

ఘనంగా బక్రీద్ పండుగ

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేలు సిద్దవటం రోడ్డు లోని ఈద్గా లో పలువురు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి ఒకరి కొకరు ఈద్ ముబారక్ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీకగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను జరుపుకుంటారని దైవ ప్రవక్త ఇబ్రహీమ్ మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరికి అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నామన్నారు.

అంధ విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల పట్టణం రోటరీపురానికి చెందిన వల్లెపు రోజా అనే రెండుకళ్ళు లేని అంధురాలు తల్లిదం డ్రులు లేని అనాథ. ఆమె తన నాయనమ్మ సంరక్షణలో జీవిస్తోంది. డిగ్రీ పూర్తి చేసిన రోజా ఇటీవల ఎడ్ సెట్ ప్రవేశపరీక్ష రాసి ఎర్రగుంట్ల బిఈడి కళాశాలలో అడ్మిషన్ కావడం జరిగింది. కోర్స్ ఫీజు ప్రతి సెమిస్టర్‌కు పదివేల రూపాయల చొప్పున మొత్తం రూ.40 వేలు చెల్లించాల్సిన అవసరం ఉంది. తాను చదువుకునేందుకు ఆర్థిక సాయంచేసే వారు లేక రోజా విద్యను మధ్యలో నిలిపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ సోమశేఖర్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకుని వెళ్లారు. వెంటనే స్పందించిన సోమశేఖర్ రెడ్డి అంధురాలైన విద్యార్థిని రోజా విద్యాభ్యాసానికి అవసరమైన 40 వేల రూపాయల మొత్తాన్ని తానే భరించి చదివిస్తానని హామీ ఇచ్చి, మొదటి విడతగా సెమిస్టర్ ఫీజు పదివేల రూపాయలు వివేకానంద స్కూలు కార్యాలయంలో విద్యార్థినికి అందజేశారు. మిగతా మొత్తాన్ని కూడా తానే సమకూర్చి, విద్యార్థి బీఈడి విద్యను అర్ధాంతరంగా ఆపివేయకుండా పూర్తిచేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సోమశేఖర్ రెడ్డి సేవా స్ఫూర్తిని సంఘమిత్ర సేవా సంస్థ అధ్యక్షులు సిరాజుద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథ రెడ్డి, చింతలజూటూరు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

విశాలాంధ్ర-రామాపురం : మండలంలోని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకు న్నారు. మండలంలోని గువ్వల చెరువు నీలకంఠరావుపేట దూదే కులపల్లి రామాపురం కర్జప వాండ్లపల్లి చిట్లూరు పాలన్న గారి పల్లి ఏకిలి పల్లి హసనాపురం బందపల్లి తదితర గ్రామాలలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. త్యాగానికి భక్తికి ప్రత్యేకగతగా ప్రతి ఒక్క ముస్లిం సోదరులు తమ శక్తి కొద్దీ మాంసాహారాలను కొత్త బట్టలు తన బంధువులకు పంచిపెట్టి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్ ముబారక్ పేరుతో ఆలింగనం చేసుకొని భక్తి భావాన్ని స్నేహభావాన్ని రుజువు చేసుకున్నారు.

ముగిసిన పోలేరమ్మ తిరుణాల మహోత్సవం

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు -ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు

విశాలాంధ్ర-అట్లూరు : మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సమీపాన వెలసిన పోతురాజు సహిత పోలేరమ్మ తిరుణాల మహోత్సవాన్ని ఆలయ నిర్వహకులు వైభవంగా నిర్వహించారు. మూడు రోజులు పాటు కొనసాగి ఉత్సవాలు ముగిశాయి. ఆలయాన్ని ప్రత్యేక పూలతో అలంకరించడంతో చూపరులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేక అలంకరణలతో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చారు. అదేవిధంగా బద్వేల్ నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ సుధఆలయ కమిటీ ఆహ్వానం మేరకు పోలేరమ్మను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పశు పోషకు ప్రోత్సాహానికి ఇచ్చే విధంగా బండలాగుడు పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఎద్దుల వృషభ రాజుల, యజమానులకు నగదు బహుమతులు అందజేసినారు. మొదటి బహుమతి రమేష్ గార్లదిన్నె అనంతపురం జిల్లా వాసులకు,80 వేల రూపాయలు బుర్రికృష్ణ యాదవ్, రెండవ బహుమతి మార్తల చంద్ర ఓబుల్ రెడ్డి చౌటపల్లి గ్రామస్తులకు, 60 వేల రూపాయలు సండ్ర శ్రీనివాస్ యాదవ్, కొండ్రెడ్డి లక్ష్మి రెడ్డి, మూడవ బహుమతి మార్త చంద్ర ఓబుల్ రెడ్డి చౌటుపల్లి గ్రామస్తులకు, 40 వేల రూపాయలు డబ్బు గుడ్ల.రమణ యాదవ్ , డబ్బు గుడ్ల. వెంకటేశ్వర్లు యాదవ్, నాలుగో బహుమతికి రామాంజనేయులు గార్లదిన్నె అనంతపురం జిల్లా వాసులకు, 20000 రూపాయలు, పోతిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఐదో బహుమతి తోట తిరుపాల్రెడ్డి మేడి మేకల పల్లి అనంతపురం జిల్లా వాసులకు, 10000 రూపాయలు, మల్లు లక్ష్మీనారాయణ రెడ్డి, ఆరో బహుమతి మహీధర్ రెడ్డి రంగోరి పల్లి, కడప జిల్లా వాసులకు ఐదు వేల రూపాయలు, ఆలయ ధర్మకర్త చేతుల మీదుగా వృషభ రాశి యజమానులకు నగదును పంపిణీ చేశారు.మిగిలిన వృషభ రాజు ఎడ్ల యజమానులకు ఐదు వేల రూపాయలు చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ మండల అధ్యక్షుడు బాలముని రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అందూరి రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, కొండ్రెడ్డి.లక్ష్మిరెడ్డి, కొండ్రెడ్డి పెంచల్ రెడ్డి, సండ్ర శ్రీనివాస్ యాదవ్, బుర్రికృష్ణ యాదవ్, డబ్బు గుడ్ల రమణయ్య యాదవ్, నాగం లక్ష్మి నర్సారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్లూరు ఎస్సై కేసిరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర-గోపవరం : మండలంలోని గోపవరం గ్రామ రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1629లో 4.17సెంట్లు కాలిగా ఉన్న గవర్నమెంట్ స్థలాన్ని ఈ మండలం లోని నిరుపేదలకు ఇంటి పట్టాలి ఇవ్వాలని గోపవరం సిపిఐ కార్యదర్శి గూడూరు. పెంచలయ్య పేర్కొన్నారు. నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వని పక్షంలొ. బుపోరాటం చేసి ఇంటి పట్టాలను దక్కించుకుంటామన్నారు.. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, శివ, రెడ్డెయ్య, పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే విజయమ్మను కలిసిన మంత్రి

విశాలాంధ్ర - బద్వేలు : మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుమారుడు రితీష్ ను కలిసిన రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం రోజు మధ్యాహ్నం బద్వేల్ లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ వారి కుమారుడు రితీష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలతెలియజేసిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రవాణా, క్రీడా,యువజన శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అనంతరం వారు కూడా ఉమ్మడి కడప జిల్లా తరపున రాష్ట్ర రవాణా క్రీడా యువజన శాఖ మంత్రిగా ఎన్నికైనందుకు లిమండిపల్లికి దుశ్శాలువతో సన్మానించి హర్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

జమ్మలమడుగులో భక్తి శ్రద్ధలతో బక్రీద్

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి - ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న బైపాస్ రోడ్డు సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.స్థానిక ఆస్థాన ఏ గౌసియా దర్గా పీఠాధిపతి ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షా గౌస్ పిరాకాద్రి బక్రీద్ యొక్క త్యాగం గురించి ఆయన వివరించారు.ఈ సందర్భంగా భక్తులు చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చి ఈద్గా మైదానంలో ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.



ప్రవక్త ఇబ్రహీం త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

పేదలకు సహాయపడడమే బక్రీద్ సారాంశం

జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ భాషా ఖాద్రి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా త్యాగ నిరతికి చిహ్నంగా ప్రపంచంలోని ముస్లింలంతా నేటి వరకు ఎంతో భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ నిర్వహించు కుంటున్నారనీ జామియమసీద్ పీఠాధిపతి సయ్యద్ షా సాధిక్ పాష ఖాద్రి పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని పెన్నా నది ఒడ్డున గల షాహి ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు,చిన్నారులు వేలాదిగా పాల్గొని పవిత్రబక్రీదు నమాజు పండుగ ఆచరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి బక్రీద్ పండుగ విశిష్టత పై వివరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ప్రసంగిస్తూ ప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా తన కుమారుడైన ఇస్మాయిల్ జబీవుల్లను అల్లాహ్ కోసం జబా చేస్తున్నప్పుడు స్వర్గ లోకం నుంచి పొట్టేలును పంపి ఇస్మాయిల్ జబీబుల్లా మరణించకుండా అల్లాహ్ కాపాడారనీ, పలుమార్లు ఇదే విధంగా ప్రవక్త తన కుమారుని జబా చేసే సమయంలో ఒక పొట్టేలు చనిపోతుందని, ఇస్మాయిల్ జబీవుల్లాకు ఏమి కాకుండా అల్లాహ్ కాపాడా రన్నారు. నాటి

నుంచి నేటి వరకు ప్రవక్త తన కుమారుడిని సైతం పవిత్ర అల్లాహ్ కోసం త్యాగం చేసే మార్గాన్ని నేటి వరకు ప్రపంచంలోని ముస్లిం మానవాళి పాటిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా శక్తి కలిగిన ముస్లింలందరూ కుర్బానీ ఇస్తున్నారని, ఈ కుర్బానీ మాంసాన్ని బంధువులకు, పేద, సాధలకు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే సామాన్య ప్రజలకు అందజేసి ప్రతి ఒక్కరూ బక్రీద్ పండుగ సంతోషంగా జరుపుకునేందుకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి కుటుంబీకులు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులందరూ ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు.

ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో డాక్టర్ డివి సుబ్బారెడ్డి బేటీ

విశాలాంధ్ర-వేంపల్లె: టీడీపీ శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డితో వేంపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నేత డాక్టర్ డివి సుబ్బారెడ్డి బేటీ అయ్యారు. ఆ మేరకు ఆయన పులివెందుల పట్టణంలోని రామగోపాల్‌రెడ్డి నివాసంలోఆయన్ను కలుసుకుని వర్దమాన రాజకీయాలపై చర్చించారు. ఈ సందర్బంగా డివి మాట్లాడుతూ ఈ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలు నకరం అనుభవించారన్నారు. ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులు ఎదుర్కొన్నారన్నారు. ఈ చీకటి పాలన ముగిసి తిరిగి స్వేచ్ఛాయుత వాతావరణం నెలకొనేందుకు టీడీపీ మరోసారి అధికారంలోకి రావడం శుభపరిణామన్నారు. ప్రజలు ఎదురు చూసిన రోజులకు ఎన్డీయే పరిపాలన వచ్చిందన్నారు. దీంతో ప్రజల ఆకాంక్ష కూడా తీరిపోయిందన్నారు. అయితే వేంపల్లె పంచాయతీ పరిధిలో అనేక సమస్యలు తిష్టవేశాయన్నారు. రోజుల తరబడి రహదారి నిర్మాణాలు చేపట్టినా ఇంకా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. దుమ్ముదూళి ఎదుర్కొని నానా అగచాట్లు పడ్డారన్నారు. ఇక వర్షం వస్తే అలవికాని కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. ఇవన్నీ ఒక పీడకలగా భావించిన ప్రజలకు మంచిరోజులు రానేవచ్చాయన్నారు. సమస్యలకు పరిష్కారం లభించే రోజులు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మా సమస్యలను రామగోపాల్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆయన స్పందిచారని సుబ్బారెడ్డి వెల్లడించారు.

చురుకుగా ఆరు వరుసల రహదారి పనులు

కోడికొండ-మేదరమెట్ల హైవే

విశాలాంధ్ర-యర్రగుంట్ల : కడప జిల్లాలోని పులివెందుల సమీపం నుంచి ఎర్రగుంట్ల మీదుగా ప్రకాశం జిల్లా వెళ్లేలా నూతనంగా కోడికొండ-మేదరమెట్ల జాతీయ రహదారి నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. డెడికేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే కింద ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. పులివెందుల సమీపం నుంచి వీరపునాయునిపల్లె మండలంలోని అనిమెల, ఎర్రగుంట్ల, మైదుకూరు మీదుగా బ్రహ్మంగారిమఠం మండలం మల్లెపల్లె నుంచి ప్రకాశం జిల్లా కనిగిరి, చీమకుర్తి మీదుగా మేదరమెట్ల మార్టూరుకు మధ్య చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి -16లో ఈ రోడ్డు కలువనుంది. ఈ రహదారి కోసం 8వేల ఎకరాల భూ సేకరణ జరిగింది. రహదారి నిర్మాణానికి సుమారు రూ.17వేల కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఎక్స్‌ప్రెస్ వే మొత్తం 332 కి.మీ. ఉండగా వాహనదారులు అన్ని చోట్ల ఈ రహదారి పైకి వెళ్లేందుకు అవకాశం ఉండదు. 13 చోట్ల మాత్రమే రహదారి పైకి ప్రవేశించేందుకు, బయటకు వచ్చేందుకు (ఎగ్జిట్) అవకాశం ఉంటుంది. నిర్మాణం పనులు పూర్తయితే రవాణాకు సౌలభ్యంగా ఉంటుందని చెప్పవచ్చు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

విశాలాంధ్ర-గాలివీడు: ఇస్లాం ప్రవక్తల త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగ అని మతపెద్దలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గుర్రాలమిట్ట వద్ద గల ఈద్గా వద్ద ఈదుల్ అదా (బక్రీద్) పర్వదిన వేడుకల సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక సామూహిక ప్రార్ధనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రవక్తల అచంచలమైన త్యాగనిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ మానవాళికి గొప్ప సందేశం ఇస్తుందన్నారు.అంతేగాక పేదలకు ఖుర్బాని దానం చేయటం ద్వారా నిరుపేద ముస్లింలు కూడా పండుగ సంతోషంగా జరుపుకోవాలనే ఆకాంక్ష స్ఫూర్తిదాయకం అన్నారు.

రాష్ట్ర మాల మహానాడు జిల్లా నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - జమ్మలమడుగు : రాష్ట్ర మాల మహానాడు కడప జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రామోజీ ఇమ్మానుయేలు పేర్కొన్నారు. సోమవారం జమ్మలమడుగు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిధి గృహంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మాల మహానాడు ఉపాధ్యక్షులు సంగటి పుల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల ఓబులేసును ఎన్నుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పై జస్టిస్ పున్నయ్య ఇచ్చిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని అన్నారు. దళితులకు స్వేచ్ఛ,సమానత్వం కల్పించి బడుగు బలహీన వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ యాక్ట్ గురించి ప్రతి దళితవాడలో అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం కాకుండా

ప్రభుత్వం,అధికారులు చర్యలు తీసుకోవాలని, గత ఐదు సంవత్సరాల నుండి ఒక్క రూపాయి కూడా సబ్ ప్లాన్ నిధులు మంజూరు కాలేదని తెలిపారు. కొత్తగా ఏర్పాటైన ఎన్డీఏ ప్రభుత్వం గతంలో జరిగిన తప్పులను మళ్లీ జరగకుండా బడుగు బలహీన వర్గాలను ఆదుకోవాలని అన్నారు. జిల్లాలోని అవినీతి అధికారులను గుర్తించి వెంటనే వారి పై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.